## విశాఖ టు వికారాబాద్

# గుట్టుగా గంజాయి రవాణా!



- న్యూ ఇయర్ నేపథ్యంలో అడ్డుకట్ట అవసరం
- యువత, విద్యార్థులే లక్ష్యంగా దందా
- కర్ణాటక, విశాఖ నుంచి ఇక్కడికి రైళ్లో తరలింపు
- వికారాబాద్ చుట్టూ ఉన్న రిసార్ట్‌లలో గుప్పుమంటున్న గంజాయి
- నామమాత్రంగా పోలీసుల తనిఖీలు
- పోలీసులు నిఘా పెంచి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

వికారాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): జిల్లాలో పలువురు అక్రమార్కులు రహస్యంగా గంజాయి దందాను కొనసాగిస్తున్నారు. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రం చుట్టు పక్కల వెలిసిన రిసార్ట్‌ల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. రైళ్లను ప్రధాన కేంద్రంగా చేసుకొని గంజాయిని జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు మార్గంలో ఎక్కడో ఒకచోట తనిఖీల్లో బయటపడితే తమ అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట పడుతుందనే ఉద్దేశంతో రైళ్లలో తరలిస్తున్నట్లు సమాచారం అందుతున్నది. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించకపోవడం, ఎప్పుడో ఓసారి తనిఖీలు చేపడుతుండడంతో పెద్ద మొత్తంలో జరుగుతున్నా వెలుగులోకి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒకవేళ రైళ్లలో పట్టుబడితే పోలీసుల దృష్టి మరల్చేందుకు అక్రమార్కులు రోడ్డు మార్గంలో తమ దందాను సాగిస్తున్నారు. ప్రధానంగా రైళ్లలో ఒడిశా నుంచి విశాఖ మీదుగా, కర్ణాటక నుంచి రైళ్లలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. నిత్యం తనిఖీలు చేయకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే తనిఖీ ల్లో తక్కువ మేర గంజాయి పట్టుపడుతున్నప్పటికీ, రైళ్ల కేంద్రంగా జరుగుతున్న దందా మాత్రం వందల కిలోలు సరఫరా జరుగుతున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లా కేంద్రంలో యువత, విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి మత్తుకు బానిసలను చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

**రూ.కోట్ల విలువ చేసే గంజాయి స్వాధీనం**

గత నాలుగేండ్లలో 60 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకొని, వీటిని తరలిస్తున్న 71 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. రైళ్ల ద్వారా మాత్రం వందల కిలోల గంజాయిని జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాలకు తరలిస్నుట్లు అనుమానాలు వస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో డ్రగ్స్ ముఠాలు పెట్రేగిపోతున్న పరిస్థితుల్లో అటు రోడ్డు మార్గంతోపాటు ఇటు రైళ్లలోనూ గంజాయి తరలింపుపై నిఘా పెట్టి కట్టడి చేయాలని కోరుతున్నారు.. గంజాయితోపాటు కర్ణాటక నుంచి జిల్లాతోపాటు జిల్లా మీదుగా హైదరాబాద్‌కు గుట్కాలను కూడా తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అమాయకులనే టార్గెట్‌గా చేసుకొని గంజాయిని రైలు మార్గం ద్వారా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో పట్టుబడిన వారంతా ఎంతో కొంత డబ్బుకు గంజాయిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైన విషయం తెలిసిందే. గంజాయి దందాను సాగిస్తున్న అక్రమార్కులు అమాయక పేదలను లక్ష్యంగా చేసుకొని వారికి డబ్బును ఎర చూపి గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తుండడం గమనార్హం. గంజాయిని తరలిస్తూ పట్టుబడిన వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని.. అసలు నిందితులను పట్టుకునే దిశగా విచారణ చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు నిందితులు మాత్రం ఎవరనేది తెలియకుండా రహస్యంగా గంజాయిని తరలిస్తూ అక్రమంగా అర్జిస్తున్నారు. అసలు ఎవరీ దందా సాగిస్తున్నారు, ఎవరికి చేరుతున్నదనే దానిపై సంబంధిత పోలీసులు నిఘా పెట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

### రిసార్ట్‌ల్లో గుట్టుగా గంజాయి విక్రయం

వికారాబాద్ జిల్లా కేంద్రం చుట్టూ పదుల సంఖ్యలో రిసార్ట్‌లు వెలిశాయి. యువతను ఆకర్షించేలా రిసార్ట్‌ల నిర్వాహకులు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి చుట్టు పక్కల వెలిసిన రిసార్ట్‌లకు ప్రతి వీకెండ్‌కు అధిక మొత్తంలో విద్యార్థులు, యువత వస్తున్నారు. ఇదే అదునుగా రిసార్ట్‌ల్లో గంజాయి గుప్పుమంటున్నట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా మరో వారంలో న్యూ ఇయర్ వేడుకలకు రిసార్ట్‌లను ముస్తాబు చేస్తున్న నేపథ్యంలో గంజాయినే ప్రధాన ఆకర్షణగా ఉండేలా రిసార్ట్‌ల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందుతున్నది. రిసార్ట్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతున్నా జిల్లా పోలీసు యంత్రాంగం మాత్రం ఎలాంటి తనిఖీలు నిర్వహించకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రిసార్ట్‌ల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లతో పోలీసులు అటు వైపు చూడడం లేదనే విమర్శలున్నాయి. రిసార్ట్‌ల్లో ఏదైనా ప్రమాదాలు జరిగితే తప్పా లోపల ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనేది తెలియకపోవడం గమనార్హం.

## తల్లిని హత్య చేసిన కేసులో... కొడుకు, కోడలికి జీవిత ఖైదు

కడ్తాల్, డిసెంబర్ 22 : రెండేండ్ల క్రితం మండల పరిధిలోని నార్లకుంట తండాలో జటావత్ బీచాలీ (58) హత్య కేసులో... కొడుకు కిషన్‌నాయక్, కోడలు విజయకు జీవితకాల శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ కోర్టు 9వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి హరీశ తీర్పునిచ్చారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. మండలంలోని నార్లకుంటతండా పంచాయతీకి చెందిన జటావత్ బీచాలీకి కొడుకు కిషన్‌నాయక్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భూతగాదాలతో కిషన్ నాయక్, ఆయన భార్య విజయ 2021 జూన్ 11న రాత్రి తల్లి బీచాలీని చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారు. మరునాడు విషయాన్ని తెలుసుకున్న కూతురు రమావత్ సుశీల.. మృతదేహాన్ని చూసి తల్లి మరణంపై అనుమానం వచ్చి, కడ్తాల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్సై హరిశంకర్‌గౌడ్ దర్యాప్తు చేపట్టారు. అప్పటి ఆమనగల్లు సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, బీచాలీ హత్య కేసులో కిషన్ నాయక్, విజయను రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు పూర్తి కావడంతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. శుక్రవారం సాక్ష్యాధారాలను విచారణ అనంతరం న్యాయమూర్తి హరీశ తీర్పును వెలువరించారు.

## కరోనాపై భయం వద్దు.. అవగాహన అవసరం



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీహెచ్‌వో చంద్రప్రకాశ్

దోమ/కుల్కచర్ల, డిసెంబర్ 22 : కరోనా వస్తున్నదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని కుల్కచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ తెలిపారు. కుల్కచర్ల సర్కారు దవాఖానలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య సిబ్బందికి వారు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా భయంపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా జెఎన్-1 కొత్త వేరియంట్ పాజిటివ్ లక్షణాలు కొవిడ్-19 లక్షణాలతో ఉండడంతో ప్రజలకు వీటిపై ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. జెఎన్-1 కొత్త వేరియెంట్‌తో జలుబు, దగ్గు, దమ్ము, జ్వరం, తలనొప్పి, వాసన పసిగట్టకపోవడం తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి, సామాజిక దూరం పాటించాలని, ఎప్పటికప్పుడు చేతులను శానిటైజ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ముఖ్యంగా చలిగాలులు తీవ్రంగా ఉండటంతో జెఎన్-1 వేరియెంట్ గాలి ద్వారా వ్యాపించే అవకాశం ఉందని, అయితే ఇబ్బంది ఏమీ ఉండదని రెండు, మూడు రోజులు చికిత్స తీసుకుంటే తగ్గిపోతుందని సూచించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రత్నమాల, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, సిబ్బంది సుజాత, వెంకటమ్మ, శ్రీనివాస్, జంగమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దామగుండాన్ని సందర్శించిన కలెక్టర్



ఆలయ అర్చకులు, స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పూడూరు, డిసెంబర్ 22 : దామగుండ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతాన్ని శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించి పరిశీలించారు. పదేండ్ల క్రితం దామగుండ రామలింగేశ్వరస్వామి అటవీ ప్రాంతంలో నేవీ సిగ్నల్ రాడార్ ఏర్పాటుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం భూపరిశీలన చేసిన విషయం తెలిసిందే. గత వారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ వికారాబాద్ జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ సిగ్నల్ రాడార్ ఏర్పాటుపై స్థానిక ప్రజలకు ఉన్న అపోహలపై తెలుసుకోవాలని సమావేశంలో కోరారు. ఈ విషయమై పరిశీలించాలని కలెక్టర్‌కు స్పీకర్ సూచించారు. దీంతో కలెక్టర్ దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయ, అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఆలయ అర్చకుల, స్థానికులతో నేవీ రాడార్ ఏర్పాటుపై ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఆర్డీవో విజయ కుమారి, ఎంవో రమాదేవి, స్థానిక సొసైటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, సత్యానందస్వామి తదితరులు ఉన్నారు.

### సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్ : సదరం క్యాంపునకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటల నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 29 తేదీల్లో తాండూరు ప్రభుత్వ దవాఖానలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. అంగవైకల్యం ఉన్న దరఖాస్తుదారులు హాజరు కావాలని తెలిపారు. అలాగే ఈ నెల 27, 30 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించే క్యాంపులకు హాజరు కావాలని తెలిపారు. ఈ క్యాంపులకు గతంలో సదరం సర్టిఫికెట్ పొంది సర్టిఫికెట్ కాల పరిమితి దాటిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

# నాణ్యమైన పత్తిని తీసుకోవాలి



జిన్నింగ్ పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ సీఎండీ లలిత్ కుమార్‌గుప్తా

పూడూరు, డిసెంబర్ 22 : ప్రభుత్వం సీసీఐ దారా ప్రకటించిన ధరకు నాణ్యమైన పత్తిని తీసుకోవాలని సీసీఐ సీఎండీ లలిత్ కుమార్‌గుప్తా సూచించారు. శుక్రవారం పూడూరు మండలంలోని ధరణి కాటన్ మిల్‌ను ఆయన సందర్శించి జిన్నింగ్ పత్తి, ఆన్‌లైన్‌లో రైతుల పేర్ల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పత్తి రైతులకు సకాలంలో వారి డబ్బు అందేలా చూడాలన్నారు. ప్రతి రైతు తమ పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులకు ఇబ్బంది కల్పిస్తే అధికారులపై చర్యలు తప్పవని తెలిపారు. రైతులు జిల్లాలోని సీసీఐ ఏర్పాటు చేసిన మిల్లులో పత్తి విక్రయించుకోవచ్చని సూచించారు. ఆయనతో పాటు అధికారులు విజయ్‌కుమార్, బాలచందర్, కార్యదర్శి ముకారం, మిల్లు నిర్వాహకులు దామోదర్ ఉన్నారు.

# కన్హాలో గీతోపదేశ్ శిఖరాగ్ర సదస్సు

నందిగామ, డిసెంబర్ 22 : మండలంలోని కన్హా శాంతి వనంలో గీతా జయంతి సందర్భంగా శుక్రవారం గీతోపదేశ్ శిఖరాగ్ర సమావేశం నిర్వహించారు. టెక్ మహేంద్ర సీఈఓ సీపీ గుర్నానీ, ప్రఖ్యాత పండితుడు ఉద య శ్రేయస్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వివేక్ వాధ్వాలుతో పాటు ఈ సమావేశంలో వర్చువల్‌గా పలు దేశాలకు చెందిన సుమారు 2వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశా న్ని తెలుసుకోవాలన్నారు. భగవద్గీతను ఆచరణా త్మకంగా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నా రు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.